


# దేశ సమగ్రతను కాపాడే బాధ్యత మనందరిది

## జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

### కామారెడ్డి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** దేశ సమగ్రతను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రన్ ఫర్ యూనిటీ %-%2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కామారెడ్డి డీఎస్పీ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి డీఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పరుగు జీవధాన్ స్కూల్ సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశాన్ని ఒకే తాటిపైకి తెచ్చి, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మహానీయుడని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో ఐక్యత, సామరస్యం నెలకొల్పాలని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు దేశ సమగ్రతను కాపాడే బాధ్యత తీసుకోవాలని, రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం ద్వారా యువతలో దేశభక్తి, జాతీయతా భావం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జాతీయ స్ఫూర్తిని పెంపొందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి అదనపు ఎస్పీ కె నరసింహ రెడ్డి, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జూనియర్ లెక్చరర్లు, ప్రిన్సిపల్స్, సంక్షేమ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి కళాశాలలో వంద శాతం విద్యార్థుల హాజరు, పరీక్షల్లో ప్రగతి, విద్యా ప్రమాణాల పెంపుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించడం, కళాశాల వారీగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా సంప్రదించి హాజరు శాతం మెరుగుపర్చాలని ఆదేశించారు. సంక్షేమ శాఖలు, విద్యా శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యా నాణ్యతతో పాటు ప్రతి కళాశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, సంక్షేమ శాఖ అధికారులు సునీత, రాజలింగు, కలీం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతలో భాగస్వాములు కావాలి

**ఉద్యమ కెరటం, హత్నూర:** కుల, మత, వర్గ, లింగ విభేదాలు లేకుండా అందరు ఐకమత్యంతో మెలుగుతూ జాతీయ సమైక్యతలో భాగస్వాములు కావాలని హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం హత్నూర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుంచి మొదలై దేవులపల్లి ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వరకు 2కే రన్ చేపట్టి జాతీయ సమైక్యత రాష్ట్రీయ ఏక్తా దివస్ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 550కి పైగా సంస్థానాలను భారత దేశంలో విలీనం చేసే దృఢ సంకల్పంతో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా కీలకపాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన మహనీయుడని తెలిపారు. పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర అద్భుతమని అన్నారు. ఆయన సంకల్పాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశ సమైక్యత, సమగ్రతకు కృషి చేయాలని కోరారు. అంతర్గత భద్రత విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, జాతీయ ఐక్యతలో భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 2కే రన్ లో గెలుపొందిన యువకులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, యువకులు, విద్యార్థులు, హత్నూర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ పటేల్ ఆలోచనలు అందరికీ ఆదర్శం కావాలి

## జిల్లా కలెక్టర్ రాజార్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలు అందరికీ ఆదర్శం కావాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం, పోషణ మాసం వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జిల్లా పరిషత్ హాల్ వరకు నిర్వహించిన ఐక్యత ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు దేశం ఒకటే %-% మనసులు కలవాలి, పటేల్ మన ప్రేరణ వంటి నినాదాలతో ఉత్సాహంగా సాగారు. అనంతరం జిల్లా పరిషత్ హాల్లో జరిగిన సమావేశంలో కలెక్టర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఏకీకరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన దూరదృష్టి, ధైర్యం మనందరికీ ఆదర్శమని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తే ఐక్యమైన భారత్ మరింత బలపడుతుందని అన్నారు. పోషణ మాసం ప్రాధాన్యంపై మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు సమతూల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే పప్పులు, ఆకుకూరలు, పండ్లతో వంటకాలు తయారు చేసి తీసుకుంటే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యవంతమవుతుందని, అందుకే అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోషణ మాసం, ఏక్తా దివాస్, నషాముక్త్ భారత్ అంశాలపై అధికారులు, అంగన్వాడీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పోషణ మాసం పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశేష సేవలందించిన అంగన్వాడీ సిబ్బందిని ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించిన కలెక్టర్, స్థానిక ఆహార పదార్థాలతో తయారు చేసిన వంటకాల రుచి చూశారు. స్వస్థ భారత్%-% పోషిత భారత్ అనే నినాదంతో రూపొందించిన ఫ్లెక్సీపై సంతకం చేసి కార్యక్రమానికి ప్రారంభించారు. సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులతో కలిసి కలెక్టర్ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సోమ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి మిల్కా, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** భారత దేశ ప్రథమ హోంశాఖ మంత్రి, ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కాంతిలాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ వహీదుద్దీన్ పర్యవేక్షణలో మండల కేంద్రంలోని యువకులు, విద్యార్థులతో కలిసి పోలీసుల ఆధ్వర్యంలో రన్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. దేశ సమైక్యత కోసం విశేషంగా కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వల్లభాయ్ పటేల్ దేశంలోని 563కు పైగా ఉన్న రాజ సంస్థానాలను స్వతంత్ర భారతదేశంలో విలీనం చేయడానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని సూచించారు.

# పత్తి కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, తాండూర్:** జిల్లాలో నవంబర్ మొదటి వారం నుంచి చేపట్టనున్న పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామ జిన్నింగ్- ప్రెస్సింగ్ యూనిట్లను మండల తహశీల్దార్ జ్యోత్స్నతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. 2025- 26 సంవత్సరంలో మద్దతు ధర కింద సీసీఐకు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు స్లాట్ బుక్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫొటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫొటో దిగాల్సి ఉంటుందని సూచించారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాల్లోనికి అనుమతించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ పథకాలు మరవలేనివి



**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రధానిగా ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన పథకాలు మరవలేనివని డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజానంద్ దేశాయి అన్నారు. ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల జాతీయం, ఎస్సీ, ఎస్టీలకు భూమి పంపిణీ వంటి అనేక పథకాలు ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, గరీబీ హటావో నినాదంతో సామాజిక న్యాయ పోరాటానికి చిహ్నమైన నాయకురాలని అన్నారు. 20 సూత్రాల కార్యక్రమంతో గ్రామీణ పేదరిక నిర్మూలనకు మార్గదర్శకులని అభివర్ణించారు. మహిళా సాధికారత, తాగునీరు, ఆరోగ్యం, చిన్నారుల పోషణ, ఎస్సీ, ఎస్టీ న్యాయం, అన్నీ ఇందిరమ్మ దృష్టిలో భాగమనీ పేర్కొన్నారు. దేశానికి ఆహార భద్రత కల్పించి, ఆత్మనిర్భర భారత్కు పునాది వేశారని కొనియాడారు. శ్వేత విప్లవంతో పాల ఉత్పత్తిలో భారత్ కి కొత్త దిశ చూపారని తెలిపారు. అప్పటి వరకు ధనవంతులకే పరిమితమైన బ్యాంకులను జాతీయం చేసి పేద రైతు తలుపుతట్టిన నేత అని అన్నారు. అనంతరం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ మాట్లాడుతూ దేశంలో ఎన్నో సంస్కరణలతో అభివృద్ధికి ఇందిరా గాంధీ ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ శివాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ దీన్ దయాల్, ఏఎంసీ డైరెక్టర్ హన్మంత్ పాటిల్, నాయకులు పురుషోత్తం పటేల్, ఉమాకాంత్ పటేల్, లక్ష్మణ్ పాటిల్ బాచావార్, వసంతరావు పటేల్, చాంద్ పటేల్, మాదయప్పా స్వామి, సారంగే నితిన్ పాటిల్, నగేష్ పటేల్, శంకర్ దుంపల్వార్, శివారెడ్డి, శ్రీధర్, శ్రీకాంత్, విలాస్ గైక్వాడ్, లక్ష్మణ్, సాయిలుగౌండ తదితరులు పాల్గొన్నారు.

